JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 14-03-2026
Medchal - Malkajgiri । Saturday 14-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 287
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 287 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com





# ఏ పేదవాడికి అన్యాయం చేయం

- ప్రజాప్రతినిధులు, నిపుణులు, నిష్ణాతులు, పౌరులు తమ సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి
- ఇప్పటికే డేటా సేకరించాం. వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సిద్ధం చేశాం
- మన రాజకీయ అవకాశాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా
- మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై శాసనసభలో కూడా చర్చకు పెడతాం

**జయభేరి, హైదరాబాద్ :**

మన భవిష్యత్తు తరాల కోసం చేపడుతున్న మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు విషయంలో ఎవరికీ అన్యాయం జరగనివ్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాలా స్పష్టంగా చెప్పారు. "ఈ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఏ పేదవాడికి అన్యాయం జరగదు. ఎవరి ఆస్తులను గుంజుకోవడం లేదు. మన అందరి భవిష్యత్తు కోసం చేపట్టిన ప్రాజెక్టు. హైదరాబాద్‌ను గొప్ప అభివృద్ధి చెందిన నగరంగా నిలబెట్టాలన్న ఆశయం. అందరూ సహకరిస్తేనే సాధ్యమవుతుంది. ముందుకు వెళ్లడానికి సూచనలు ఇవ్వండి". అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. మూసీ నది పునరుజ్జీవం ఫేజ్ 1 పై ప్రభుత్వం ఏర్పాటు చేసిన MusiInvites సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మూసీ చారిత్రక పరిణామాలు, ప్రాజెక్టు లక్ష్యాలు, దాని ఆవశ్యకతను వివరిస్తూ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంలో ప్రజాప్రతినిధులు, నిపుణులు, నిష్ణాతులు, పౌరులు తమ సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ...మిగతాది 2 లో

హైదరాబాద్ నగర నాగరికత, సాంస్కృతిక వారసత్వాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలన్న సంకల్పంతో, మురికి కూపంగా మారిన మూసీ నదిని పునరుజ్జీవింపచేయాలన్న గొప్ప తలంపుతో, మూసీ దిగువన ఉన్న ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల కాలుష్య వెతలకు శాశ్వత పరిష్కారం ఇవ్వాలన్న మానవత్వంతో ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక "మూసీ పునరుజ్జీవం -రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్" ప్రాజెక్టు తలపెట్టింది. ఈ ప్రాజెక్టు పై కొందరు వ్యక్తులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు అసత్యాలు, అర్ధ సత్యాలతో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్న నేపథ్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేశాం. - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# ఇప్పుడు ప్రయాణం మరింత సులభతరం




- చర్లపల్లి నుంచి అస్సాంలోని కామాఖ్య వరకూ వెళ్లే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ

**గువాహటి, మార్చ్ 13 :**

ఈశాన్య ప్రాంతాలకు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే వారికి ఇప్పుడు ప్రయాణం మరింత సులభతరం కానుంది. చర్లపల్లి నుంచి అస్సాంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కామాఖ్య వరకూ వెళ్లే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ ఎక్స్‌ప్రెస్ స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో సేవలు అందించనుంది. దీంతో ఈశాన్య ప్రాంతాలకు వెళ్లే వారు ఇప్పుడు తక్కువ ఖర్చుతో సులభతరమైన ప్రయాణం చేసే వీలుంది. ఈ రైలు మార్గ మధ్యంలో ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని శ్రీకాకులం రోడ్, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమండ్రి, తణుకు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొంట స్టేషన్‌లలో ఆగుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌తో పాటు న్యూజల్పాయ్‌గురి నుంచి గువాహటి వరకూ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ని, నారంగి నుంచి త్రిపుర రాజధాని మధ్య ప్రయాణించే ఎక్స్‌ప్రెస్‌ని కూడా మోడీ ప్రారంభించారు. ...మిగతాది 2 లో

# ఎమ్మెల్యేలపై వేటుకు సిద్ధమవుతున్న అధినేత



- నలుగురు ఎమ్మెల్యేలపై వేటు వేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం
- ఆ నియోజకవర్గాలకు పార్టీ ఇన్ ఛార్జులను నియమిస్తారన్న టాక్
- ఆ నలుగురు ఎవరన్న దానిపైనే ఇప్పుడు టీడీపీలో ఉత్కంఠ

**జయభేరి, విజయవాడ, మార్చి 13 :**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. నలుగురు ఎమ్మెల్యేలపై వేటు వేయడానికి చంద్రబాబు సిద్ధమవుతున్నారు. అయితే వేటు ఏ రూపంలో ఉంటుంది? ఎవరిపై ఉంటుందన్న చర్చ ఇప్పుడు తెలుగుదేశం పార్టీలో జోరుగా జరుగుతుంది. ఇటీవల చంద్రబాబు నాయుడు టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్షించారు. గతంలో నలభై మంది ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిని చంద్రబాబు వ్యక్తం చేశారు. ఆ నలభై మంది ఎమ్మెల్యేలతో చంద్రబాబు పిలిచి వన్ టు వన్ మాట్లాడారు. పనితీరు ...మిగతాది 2 లో

# రేవంత్ రెడ్డి బినామీలపై విచారణ చేయాలి

- రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఘాటైన లేఖ
- ముఖ్యమంత్రి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని KLSR కంపెనీపై ఉన్న కేసుల సాక్ష్యాధారాలను మాయం చేయిస్తున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు



**జయభేరి, హైదరాబాద్, మార్చి 13 :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బినామీ కంపెనీలకు అడ్డగోలుగా కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆరోపిస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఘాటైన లేఖ రాశారు. ముఖ్యంగా KLSR ఇన్ఫ్రాటెక్ అనే కంపెనీ ముఖ్యమంత్రికి బినామీ సంస్థ అని, అది దివాలా తీసిన స్థితిలో ఉన్నప్పటికీ సుమారు రూ. 2,500 కోట్ల విలువైన భారీ కాంట్రాక్టులను దానికి ...మిగతాది 2 లో



# మైనర్ బాలికలపై లైంగిక దాడి

- మైనర్ బాలుడి కీచకం

**నాగర్ కర్నూలు :**

ప్రేమ పేరుతో పలువురు మైనర్ బాలికలను మోసం చేసి అఘాయిత్యాలకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి పాల్పడ్డాడు. అఘాయిత్యాలను ఫోన్లో చిత్రీకరణ.. డబ్బు ఇవ్వాలని లేదంటే ఆ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని, వారి తల్లిదండ్రులకు కూడా పంపిస్తానని బెదిరింపులకు గురి చేసారు. కొత్తపల్లి, నాగర్ కర్నూల్, వనపర్తికి చెందిన ముగ్గురు తోటి ఇంటర్ బాలికలను ప్రేమ పేరుతో కీచకుడు లోబర్చుకున్నాడు. ఓ మైనర్ బాలిక గర్భం దాల్చగా.. కొల్లాపూర్లోని సాయి కృప ఆసుపత్రిలో ఆమెకు అబార్షన్ చేయించారు. ఈ ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగింది. విద్యార్థి ఆగడాలను భరించలేక బాధితుల్లో ఓ విద్యార్థిని తన తల్లిదండ్రులు, బంధువులకు చెప్పుకొని ఏడ్వడంతో విషయం బైటకి పొక్కింది. బాధితురాలి తల్లిదండ్రులు ఆ బాలుడిని కొట్టి.. అతడి నుంచి ఫోన్ లాక్కుని, అనంతరం అతడిని, ఫోనును పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి.. జువెనైల్ హోంకు తరలించారు. కొల్లాపూర్లోని సాయి కృప ఆసుపత్రికి చెందిన ఇద్దరు వైద్యులు, ఓ నర్సును రిమాండ్ కు పంపారు.



# గ్యాస్ కొరత

- కట్టెల ధరలు రెట్టింపు
- హోటల్లు మూత

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. మూడు రోజుల కిందట క్వింటాల్ రూ.1200 ఉన్న కట్టెల ధర ఇప్పుడు రెట్టింపు అయింది. పెళ్లిళ్ల సీజన్, సిలిండర్ల సరఫరా తగ్గడంతో హాస్టళ్లు, రెస్టారెంట్లు టన్నుల కొద్దీ కట్టెలను కొనుగోలు చేస్తున్నాయి. డిమాండ్ పెరగడంతో భువనగిరి, ఆలేరు నుంచి హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున కట్టెలు చేరుకుంటున్నాయి. గ్యాస్ అందుబాటులో లేక ...మిగతాది 2 లో

# టీఎంసీ నేతలకు రాష్ట్రపతి భవన్ షాక్..

- అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు నిరాకరణ!



**జయభేరి, న్యూఢిల్లీ:**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవాలనుకున్న తృణమూల్ నేతలకు చుక్కెదురైంది. రాష్ట్రపతి బిజీ షెడ్యూల్ కారణంగా గురువారం (మార్చి 12)న అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు రాష్ట్రపతి కార్యాలయం నిరాకరించింది. బెంగాల్ ఆదివాసీలకు అందుతున్న సంక్షేమ పథకాలను రాష్ట్రపతికి వివరించేందుకు 12 మంది సభ్యులతో కూడిన తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధి ...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఎమ్మెల్యేలపై వేటుకు..

మెరుగు పర్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ నేపథ్యంలో మరోసారి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష జరిపారు. మద్యం కేసు ఎమ్మెల్యేలు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడం, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, తమ వ్యాపారాలకే పరిమితం కావడంతో పాటు నియోజకవర్గంలో ఇసుక, మద్యం వంటి వాటిల్లో ఆరోపణలు ఎదుర్కొనడం వంటి వాటిపై కేంద్ర పార్టీ నుంచి మాత్రమే కాకుండా నిఘా వర్గాల ద్వారా నివేదికను తెప్పించుకున్నారు. ఎమ్మెల్యేల పనితీరు బాగా లేకపోతే, వారిపై ప్రజల్లో అసంతృప్తి పెరిగితే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడం కష్టమని భావించి ఎమ్మెల్యేల పనితీరుపైనే చంద్రబాబు ఎక్కువ ఫోకస్ పెట్టారు. తన తెలుగుదేశం పార్టీకి చెందిన 130 మందికి పైగా ఎమ్మెల్యేల్లో నలభై మందిపై ప్రజలు పెదవి విరుస్తున్నారని, ఆ నియోజకవర్గాల్లో పోటీ ఇబ్బందులు ఎదుర్కొంటుందని గుర్తించారు. నష్ట నివారణ చర్యల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లయినా పార్టీ పనితీరును మార్చుకోని నలభై మంది ఎమ్మెల్యేలను గుర్తించి తిరిగి వారి పనితీరును సమీక్షించిన చంద్రబాబు అందులో నలుగురు మాత్రం పార్టీలో ఉంటే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ అని భావిస్తున్నారు. దీంతో ఆ నలుగురిపై చర్యలు తీసుకోవాలని సిద్ధమయ్యారు. కోస్తా జిల్లా నుంచి ఇద్దరు, రాయలసీమ జిల్లా నుంచి ఒకరు, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మరొకరు ఈ వేటు పడే వారిలో ఉన్నట్లు సమాచారం. వీరికి ఫైనల్ వార్నింగ్ కూడా పూర్తి కావడంతో ఇక ఉపేక్షించి లాభంలేదని భావించిన చంద్రబాబు త్వరలోనే ఆ నలుగురిపై సస్పెన్షన్ వేటు వేసి, ఆ నియోజకవర్గాలకు పార్టీ ఇన్ ఛార్జులను నియమిస్తారన్న టాక్ పార్టీలో బాగా నడుస్తుంది. ఆ నలుగురు ఎవరన్న దానిపైనే ఇప్పుడు టీడీపీలో ఉత్కంఠ నెలకొంది.

## టీఎంసీ నేతలకు..

బృందం కలవాలనుకుంది. కానీ రాష్ట్రపతి భవన్ బిజీ షెడ్యూల్‌ను పేర్కొంటూ సమయం ఇవ్వడానికి నిరాకరించింది. అయితే, వచ్చే వారం అయినా రాష్ట్రపతిని కలిసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ బృందం మరో లేఖను పంపించినట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ బెంగాల్ పర్యటన సందర్భంగా ప్రోటోకాల్ ఉల్లంఘన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ముర్ము స్వయంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల సిలిగురి వివాదం చుట్టూ ఉన్న అపోహలను పరిష్కరించుకోవడానికి TMC ప్రతినిధి బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలవాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరారు. TMC రాష్ట్రపతితో సమావేశం కావాలని అభ్యర్థించింది. కానీ రాష్ట్రపతి సమయం లేదని రాష్ట్రపతి భవన్ స్పందించింది. అప్పటి నుండి TMC వచ్చే వారం పార్టీ ఎంపీలతో సమావేశం కావాలని రాష్ట్రపతిని సూచించింది. మార్చి 7వ తేదీన 9వ అంతర్జాతీయ సంతాల్ సదస్సులో పాల్గొనడానికి రాష్ట్రపతి బెంగాల్‌లోని సిలిగురికి వెళ్లారు. అయితే, బాగ్డోగ్రా విమానాశ్రయంలో ఆహ్వానం పలికేందుకు బెంగాల్ మంత్రులు ఎవరూ లేక పోవడం పట్ల ద్రౌపది ముర్ము అసంతృప్తి వ్యక్తం చేశారు. సిలిగురి సమీపంలో తన కార్యక్రమం వేదిక మార్పుపై కూడా ముర్ము అసంతృప్తి వ్యక్తం చేశారు.

## రేవంత్ రెడ్డి బినామీలపై..

అప్పగించారని కేటీఆర్ ఆరోపించారు. సాగునీరు, తాగునీరు, యంగ్ ఇండియా స్కూల్స్, రోడ్డు నిర్మాణ పనుల్లో ఈ అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని KLSR కంపెనీపై ఉన్న కేసుల సాక్ష్యాధారాలను మాయం చేయిస్తున్నారని కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. సేకరించిన సాక్ష్యాధారాలు పోయాయని ప్రభుత్వ అధికారులు కోర్టులో చెప్పడం దారుణమని, ఇది అధికారులపై ముఖ్యమంత్రి చేస్తున్న ఒత్తిడికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర విచారణ సంస్థలు, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయిందని, విచారణ సజావుగా సాగకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. నేషనల్ లా ట్రిబ్యునల్ విచారణలో కూడా రేవంత్ రెడ్డి జోక్యం చేసుకున్నారని, ఇప్పటికే ఈ వ్యవహారంలో నిజాలు నిగ్గుతేల్చాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ ఆరోపించారు. నిష్పాక్షిక విచారణ జరగాలంటే కేంద్ర సంస్థలైన సీబీఐ, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ రంగంలోకి దిగాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఆర్థిక అక్రమాలే కాకుండా, వ్యవస్థలను మేనేజ్ చేస్తున్న తీరుపై సమగ్ర దర్యాప్తు అవసరమని కోరారు. అమిత్ షాతో పాటు ఈ లేఖ ప్రతులను కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్వాల్లకు కూడా కేటీఆర్ పంపించారు. బినామీ కంపెనీల ద్వారా రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తున్నారని, కార్పొరేట్ గవర్నెన్స్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి వర్సెస్ కేటీఆర్ పోరును జాతీయ స్థాయికి తీసుకెళ్లినట్లయింది.

## గ్యాస్ కొరత

కొన్ని హోటళ్లు మూతపడ్డాయి. వినియోగదారులు తెల్లవారుజాము నుంచే కట్టెల మండీల వద్ద బారులు తీరుతున్నారు. గ్యాస్ సిలిండర్ల కోసం ఒక నెల ముందు బుక్ చేసుకోవాలని వినియోగదారులు వాపోతున్నారు.

# రాష్ట్రంలో 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుంది

- అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ఉపేక్షించబోము
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**జయభేరి, హైదరాబాద్ మార్చ్ 13 :**

రాష్ట్రంలో 810 ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజాగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం, అక్రమంగా మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు. ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విధంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని ఆయన హెచ్చరించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకమారు ఎల్‌పిజి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని, గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస్ సరఫరా చేస్తామని, ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# కామన్ సివిల్ కోడ్ కు లైన్ క్లియర్




యూనిఫైడ్ కామన్ సివిల్‌కోడ్ దేశంలో అమలు చేసేందుకు కేంద్రం చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. కానీ, విపక్షాలు తరచూఅడ్డుకుంటున్నాయి. తాజాగా సుప్రీం కోర్టు ఈ చట్టం అమలు ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేసింది. ముస్లిం మహిళల పట్ల వివక్ష చూపుతున్న 1937 నాటి షరియత్ చట్ట నిబంధనలను సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలో ఉమ్మడి పౌర స్మృతి అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం, ఈ కేసులో మహిళలకు ఆస్తి వారసత్వంలో వివక్ష జరుగుతోందన్న వాదనతో ఏకీభవిస్తూనే, దీనిపై తుది నిర్ణయం తీసుకునే బాధ్యతను శాసనసభకే వదిలివేయడం ఉత్తమమని పేర్కొంది. సుప్రీంకోర్టు 1937 షరియా చట్టం ముస్లిం మహిళల ఆస్తి హక్కుల్లో వివక్ష సృష్టిస్తోందనే పిటిషన్‌పై ఈ వ్యాఖ్యలు చేసింది. దేశవ్యాప్త ఏకీకృత పౌర చట్టం అమలు అత్యవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ చట్టాన్ని కొట్టివేస్తే చట్ట శూన్యత ఏర్పడుతుందని, శాసనసభ చర్యలు తీసుకోవాలని సూచించింది.షరియా నిబంధనలు మహిళలకు పురుషులతో పోలిస్తే తక్కువ వాటాను కేటాయిస్తాయి. ధర్మాసనం ఈ వివక్షను గుర్తించి, సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం ముస్లిం మహిళలు పొందుతున్న హక్కులను కోల్పోకుండా రక్షించాలని సీజేఐ సూర్యకాంత్ హెచ్చరించారు. భారత వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలనే వాదనను కోర్టు తిరస్కరించింది.రాజ్యాంగ ఆదేశిక సూత్రాల ప్రకారం యూసీసీ అమలు పార్లమెంటు బాధ్యత అని ధర్మాసనం పేర్కొంది. గతంలో కోర్టులు యూసీసీ సిఫారసు చేశాయి, కానీ శాసనాధికారులు స్పందించకపోవడం ఆందోళనకరం. ఒకే భార్యా నిబంధన అన్ని వర్గాలకు వర్తింపకపోవడాన్ని జస్టిస్ బాగ్చీ ఎత్తిచూపారు. ఈ సమానత్వం లేకపోవడం పౌరుల మధ్య విభేదాలకు దారితీస్తోంది.సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో యూసీసీ అమలుకు ఒత్తిడి పెరుగుతుంది. షరియా చట్టం మహిళల ఆర్థిక భద్రతను బలహీనపరుస్తూ, ఆధునిక సమాజంతో పోలికలేని అసమానతలు కలిగిస్తోంది. ఈ న్యాయపరమైన శూన్యత దూరం కాకపోతే, మతపరమైన చట్టాలు రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా మారతాయి.

అందుకే యూసీసీ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.అలాగే సంస్కరణల పట్ల ఉన్న ఆతురతలో ముస్లిం మహిళలు ఇప్పుడు పొందుతున్న హక్కులను కూడా కోల్పోయే పరిస్థితి రాకూడదని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యలన్నింటికీ 'యూనిఫాం సివిల్ కోడ్' ఒక్కటే శాశ్వత పరిష్కారమని, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దీనిని రూపొందించే అధికారం పార్లమెంటుకు ఉందని ఈ సందర్భంగా ధర్మాసనం స్పష్టం చేసిందిఇదే పిటిషన్ విచారణ సందర్భంగా మరో న్యాయమూర్తి జస్టిస్ బాగ్చీమాట్లాడుతూ.. 'ఒక పురుషుడికి ఒకే భార్య' అనే నిబంధన ప్రస్తుతం అన్ని వర్గాలకు సమానంగా వర్తించడం లేదని, ఇటువంటి అసమానతలను తొలగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, షరియత్ చట్టాన్ని కొట్టివేసి భారత వారసత్వ చట్టాన్ని వర్తింపజేయాలని కోరగా, కోర్టు దానిని సున్నితంగా తోసిపుచ్చింది. కోర్టులు గతంలో కూడా అనేకసార్లు యూసీసీని తీసుకురావాలని సిఫార్సు చేశాయని, ఈ విషయంలో పార్లమెంటు తన విజ్ఞతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 44 ప్రకారం, పౌరులందరికీ ఒకే రకమైన పౌర స్మృతి ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనివల్ల మతం, కులంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, దత్తత వంటి అంశాలలో అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది. ఇది జాతీయ సమైక్యతను, లింగ సమానత్వాన్ని పెంచుతుందని మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే, మైనారిటీల మత స్వాతంత్ర్యం సాంస్కృతిక హక్కులకు భంగం వాటిల్లుతుందని, మెజారిటీల ఆధిపత్యం పెరుగుతుందని వ్యతిరేకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోవా వంటి కొన్ని రాష్ట్రాల్లో UCC అమలులో ఉంది.UCC అమలులో ఉన్న అతి పెద్ద సవాళ్లు, వివిధ మత సమాజాల నుంచి వస్తున్న తీవ్ర ప్రతిఘటన, దేశంలోని విభిన్న సాంస్కృతిక వైవిధ్యం. ముఖ్యంగా, ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్, 1937 లోని కొన్ని నిబంధనలు, లింగ వివక్ష చూపుతున్నాయని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 లకు విరుద్ధమని విమర్శకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు మళ్ళీ చట్టసభలకే ఈ బాధ్యతను అప్పగించడం, న్యాయపరమైన జోక్యం ద్వారా ఆకస్మిక మార్పులు చేయడం వల్ల దేశ సమైక్యతకు విఘాతం కలగవచ్చని భావిస్తోంది. ఈ యూనిఫాం సివిల్ కోడ్ అమలు అనేది ఒక సుదీర్ఘమైన శాసన ప్రక్రియ అని, దీనికి రాజకీయ ఏకాభిప్రాయం, లోతైన సామాజిక ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలని కోర్టు స్పష్టం చేసింది.



# జాబ్ క్యాలెండర్ బౌన్స్ అయింది

- నిరుద్యోగులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు
- బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్ :**

ప్రభుత్వం ప్రజా పాలన,ప్రగతి ప్రోగ్రామ్ కింద 99 రోజుల ప్రణాళిక చేపట్టింది. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగుల కోసం ఒక్క రోజు చర్చించక పోవడం దురదృష్టకరం. రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు ఆశలు కల్పించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో 2 లక్షల ఉద్యోగాలు సంవత్సరానికి ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓట్లు వేస్తే పోరాటం చేస్తున్న వారి తలలు పగలగొడుతున్నాదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు. యూపీఎస్సి కొత్త నిబంధనతో నెల రోజులు ఆలస్యంగా నోటిఫికేషన్ ఇచ్చింది. జ్యుడీషియరీ వ్యవస్థలో సంస్కరణలు వచ్చాయి. ఏపీ ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధన తెచ్చింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై కమిటీ వేసింది. తెలంగాణ ప్రభుత్వం సిలబస్ కమిటీ వేసి సంవత్సరం అయినా ఉలుకు,పలుకు లేదు. నిరుద్యోగ సమస్య ప్రభుత్వానికి ప్రయారిటీ లేదు. ఉద్యోగాల పేరుతో ప్రభుత్వం నాటకాలాడుతోంది. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాబ్ క్యాలెండర్ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి ప్రవేశ పెడితే ఇప్పటి వరకు దిక్కు లేదు. జాబ్ క్యాలెండర్ బౌన్స్ అయింది. వీళ్ళు సిపాయిలు అయినట్లు మూసీని ప్రక్షాళన చేసి నైట్ ఎకానమీ తయారు చేస్తారు అంట. ప్రయివేటు ఉద్యోగాలపై ప్రభుత్వం పాలసీ ఏంటి...? కేసీఆర్ హయాంలో ఐటీ ఉద్యోగాలు 10 లక్షలు కొత్తగా వచ్చాయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రతి రెండు ఏళ్లకు ఒక సారి పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. చివరిగా బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2022లో పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చింది. నిరుద్యోగుల పుణ్యంతోనే ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారు. దిల్ సుఖ్ నగర్ లో ఆందోళన చేసిన నిరుద్యోగులపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. నిరుద్యోగులు రేవంత్ రెడ్డి సెక్రటేరియట్ మెట్లు ఎక్కే విధంగా చేశారు. రేవంత్ రెడ్డి నిరుద్యోగులను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన ప్రభుత్వాన్ని,పాలనను అప్ డేట్ చేసుకోవాలని అన్నారు.

# ఏ పేదవాడికి అన్యాయం చేయం



శాసనమండలి చైర్మన్, శాసనసభ స్పీకర్, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ అన్యాయం జరగదు. నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వడంపై సలహాలు సూచనలు ఇవ్వండి. మూసీ ప్రతిపాదిత ప్రాజెక్టు వెంట మొత్తంగా 10 వేల పేద కుటుంబాలున్నాయి. ఇప్పటికే డేటా సేకరించాం. వారందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సిద్ధం చేశాం. అయితే, దూరప్రాంతాలకు వెళ్లడం వల్ల చిన్న చిన్న పనులు చేసుకునే వారు ఉపాధి కోల్పోతామని అంటున్నారు. అందుకని సమీప ప్రాంతాల్లోనే ఇండ్లు కట్టించే ఏర్పాటు చేస్తున్నాం. ఎవరికీ నష్టం చేయం. వారితో నాకు శత్రుత్వం ఏముంటుంది. పేదల్లో దుఃఖాన్ని దూరం చేసే ప్రయత్నం చేస్తున్నాం. నా ఆలోచనలన్నీ పేదల వెంటే ఉన్నాయి. ఏ పేదవాడికి అన్యాయం చేయం. ఏ పేదవాడిని నిరాశ్రయులుగా చేయబోం. పేదలకు నష్టం కలిగించడానికి, కొంతమంది రియల్ ఎస్టేట్ సంస్థల ఆర్థిక ప్రయోజనాల కోసమో పనిచేయడం లేదు. ఈ రాష్ట్రాన్ని, నగరాన్ని గొప్ప అభివృద్ధి చెందిన నగరంగా నిలబెట్టాలని అనుకుంటోంది. ఇందులో మనమంతా భాగస్వాములం. చరిత్రను ఒకసారి గమనిస్తే, నది పరీవాహక ప్రాంతాల్లోనే నాగరికత విలసిల్లింది. నదులు, సముద్రం, నీటి ప్రవాహాలు ఉన్న ప్రాంతాలే అధికంగా అభివృద్ధి చెందాయి. థేమ్స్, హడ్సన్ నదులు, సింగపూర్, సియోల్, దుబాయ్, అహ్మదాబాద్ సబర్మతీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులు... ఎన్నింటినో గమనించిన తర్వాత తెలంగాణ కూడా ఆర్థిక ప్రగతిని సాధించాలని, అభివృద్ధి నిరోధకులుగా ఉంటే భావి తరాలు క్షమించవని మూసీ రివర్ ఫ్రంట్ కార్యక్రమాన్ని చేపట్టాం. 1908లో మూసీకి ఉప్పెన వచ్చి వేలాది మంది మరణించిన సందర్భంలో ఆనాటి నిజాం వరద నివారణ, జంట నగర ప్రజల దాహార్తిని తీర్చడానికి వందేళ్ల కిందట ఒక గొప్ప విజన్‌తో ఉస్మాన్‌సాగర్, నిజాంసాగర్‌లను నిర్మించిన చరిత్రను విస్మరించరాదు. ఎంతో దూరదృష్టితో వందేళ్ల కిందట గొప్ప గొప్ప ప్రాజెక్టులు, వారసత్వ సంపదను సృష్టించి మేటి నగరంగా అందించారు. అలాంటి నగరాన్ని ఇలాగే వదిలేద్దామా. ప్రపంచంలో వస్తున్న మార్పులు, పర్యావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ముందుకు వెళదామా. మన రాజకీయ అవకాశాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా.

రాజకీయ ప్రయోజనం కోసం తప్పుడు ప్రచారం చేయొద్దు. ప్రాజెక్టుకు సహకరించకపోయినా పర్లేదు. కానీ అడ్డురాకండి. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుపై శాసనసభలో కూడా చర్చకు పెడతాం. అందరూ తమ అభిప్రాయాలు చెప్పాలి. అందరి సలహాలు స్వీకరిస్తాం. ప్రాజెక్టు కోసం ఎంతో కసరత్తు చేశాం. గ్లోబల్ టెండర్లు పిలిచి కన్సల్టెంట్లను నియమించాం. హైదరాబాద్ నగర జనాభా 1.34 కోట్లుంటే, మరో 25 ఏళ్లలో 2.5 కోట్లకు చేరనుంది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన ఉంది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నప్పుడు భావి తరాలకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవద్దా. మూసీ వెంట నివాసం ఏర్పాటు చేసుకున్న వారి గురించి సానుభూతితో మాట్లాడుతున్నాం. మూసీ కిందనున్న నల్గొండ ప్రజల గురించి కూడా ఆలోచన చేయాలి. విపరీతమైన వ్యర్థాలు, పారిశ్రామిక కాలుష్యం, కళేబరాలతో కాలకూట విషంతో నల్గొండ ప్రజల జీవితాలు అతలాకుతలమవుతున్నాయి.మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా, కొందరు సంపూర్ణ సమాచారం లేకపోవడం వల్ల ఒక రకమైన ఆందోళన తలెత్తింది. ప్రజలు ఒక బాధ్యతతో, విశ్వాసంతో నమ్మి అధికారం అప్పగించినప్పుడు, కాపలాదారుడిగా ఉంటాం. మా ఆలోచన ఎవరికో నష్టం కలిగించాలని కాదు. ఎవరైనా కావాలని, కోరుకుని మూసీ వెంట జీవించాలని అనుకుంటారా. నిలువ నీడ లేని వాళ్లే మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్నారు.ఈ ప్రాజెక్టు గురించి రకరకాలుగా మాట్లాడుతున్నారు. మూసీకి అటో కి.మీ, ఇటో కి.మీ కూల్చేస్తాడని ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టులో మానవీయ కోణాన్ని ఎక్కడా విస్మరించలేదు. మూసీ వెంట దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్న పేదవారితో చెలగామాడకండి.గాంధీ విగ్రహం కోసం 5 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. దాదాపు 75 కోట్లకు మించి ఖర్చు చేయడం లేదు. మొత్తం ప్రాజెక్టు 6500 నుంచి 7 వేల కోట్లకు మించి లేదు.ఏఐ వంటి సాంకేతిక విప్లవాన్ని ఎలాగూ ఆపలేం. ఏఐ వల్ల వైట్ కాలర్ ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నప్పుడు, బ్లూ కాలర్ ఉద్యోగాలు సృష్టించొద్దా. మూసీ ఒక పర్యటక కేంద్రంగా, నైట్ ఎకానమీగా, ఆర్థిక అభివృద్ధి కోసం చేయొద్దా.నేను కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతా. మనం చేసిన మంచి, చెడు ఇక్కడే ఉంటాయి. భగవంతుడు నాకిచ్చిన అవకాశానికి సార్థకత చేకూరాలని కోరుకుంటున్నా. ప్రకృతికన్నా మనం గొప్పవాళ్లం కాదు.ఇది కోట్లాది మంది నగర ప్రజల భవిష్యత్తు. దీన్ని కాపాడుకుందామా. కాలానికి వదిలేద్దామా. ఏం కావాలో సలహాలు ఇవ్వండి. వెబ్‌సైట్‌లో మీ అభిప్రాయాలను తెలియజేయండి. మంచిని తప్పకుండా స్వీకరిస్తాం. కుట్ర సిద్ధాంతానికి ముగింపు పలకండి. నేను మీలో ఒకడిని. అందరం కలిసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్దాం. ప్రపంచంతో పోటీపడే విధంగా హైదరాబాద్ ను ఒక అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దుకుందాం..." అని ముఖ్యమంత్రి భావోద్వేగంతో చెప్పారు. తొలుత ఈ సమావేశంలో మూసీ నది పూర్వోత్తరాలు, ప్రస్తుత స్థితిగతులు, నగర ప్రజల భవితవ్యం, నది పునరుజ్జీవం ఆవశ్యకత, ఆవసరం, ప్రపంచ వ్యాప్తంగా రివర్‌ఫ్రంట్‌ల ప్రాముఖ్యత, మూసీ రివర్‌ఫ్రంట్‌లోని ప్రధాన అంశాలతో పాటు మూసీ పునరుజ్జీవం రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ Phase1 సమగ్ర స్వరూపాన్ని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

# యాదాద్రిలో నేత్రపర్వంగా ఊంజల్ సేవ

- శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.18.02 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 13 :**



శ్రీపంచ నారసింహ క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో శ్రీఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీపాంచరాత్రాగమన ప్రకారం కొండపైన అద్దాల మండపంలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం,వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీ సత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి శుక్రవారం నిత్యరాబడిలో భాగంగా రూ.18,02,681 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,37,750, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,41,600, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.1,32,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.1,20,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,40,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.54,600,ప్రసాద విక్రయం ద్వారా రూ.6,02,100, కల్యాణకట్ట ద్వారా రూ.42,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడికి విరాళం..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి అన్నప్రసాదానికి భక్తుడు విరాళం అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూ.గో.జిల్లా వెట్లపాలెంకు చెందిన అమటం శైలేంద్రనాథ్, పద్మావతి, షణ్ముక్, మయూర్ స్వామివారి అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు.

# అభివృద్ధికి.. 23 అంశాలపై సుదీర్ఘ చర్చ

- ముస్సిపల్ తొలి సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య
- ముస్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణి-భరత్ గౌడ్ అధ్యక్షతన పలు తీర్మానాలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



యాదగిరిగుట్ట మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి పాలకవర్గం దృష్టి కేంద్రీకరించిందని.. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనార్థం ప్రతిరోజు లక్షలాదిమంది విచ్చేసిన భక్తుల సౌకర్యాలు..అదేవిధంగా మున్సిపల్ ప్రజలకు అన్ని వార్డులలో సమగ్ర అభివృద్ధి పనులకు సంబంధించిన 23 అంశాలపై పాలకవర్గం చర్చించిందని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. తాను ఎక్స్ అఫీషియో సభ్యునిగా సమావేశంలో పాల్గొన్నానని ఆయన తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసిన 15 కోట్ల రూపాయలతో పనులు చేపడుతున్నామని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం ప్రధాన దేవాలయంగా ఉందని..అదే క్రమంలో యాదగిరిగుట్ట మున్సిపాలిటీని తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.

**నాలుగు గంటల పాటు సుదీర్ఘ చర్చ**

యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అధ్యక్షతన మున్సిపల్ పాలకవర్గం తొలి సమావేశం శుక్రవారం జరిగింది. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 12 వార్డుల అభివృద్ధిపై దాదాపు నాలుగు గంటల పాటు చర్చించి తీర్మానాలు చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బరిగె రమ్య రామ చందర్,మున్సిపల్ కౌన్సిలర్లు బోడ రాధసురేష్, బూడిద మధు, కాటబత్తిని స్వప్నఆంజనేయులు, బిట్లు సరోజహరీష్,కర్రె మాధవిప్రవీణ్, పెలిమెల్లి లావణ్య శ్రీధర్ గౌడ్, పేర బోయిన సత్యనారాయణ యాదవ్, సాధునేని ధనలక్ష్మి మధుకర్, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, బబ్బూరి శ్రీధర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఇంటి పన్నును సకాలంలో చెల్లించి పెనాల్టీ నుండి తప్పించుకోండి

- పరవాడ మండలంలో "మిషన్ 100%" ప్రారంభం
- వారం రోజుల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలే లక్ష్యం - ఎంపీడీఓ రమేష్ నాయుడు

**జయభేరి, పరవాడ:**



గ్రామ పంచాయతీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పరవాడ మండల యంత్రాంగం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. వారం రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌ను ప్రకటించింది. మార్చి 20, 2026 నాటికి పాత బకాయిలతో సహా ప్రస్తుత ఏడాది పన్ను మొత్తాన్ని వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.అన్ని విభాగాల సమన్వయంతో క్షేత్రస్థాయి కార్యాచరణ గ్రామాల్లో వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీరు వంటి కనీస సౌకర్యాల కల్పనకు ఇంటి పన్నులే ప్రధాన వనరుగా ఉండడంతో ఈ నేపథ్యంలో, ప్రతి ఇంటికి చేరువయ్యేందుకు ప్రభుత్వం అన్నిస్థాయిల క్షేత్ర సిబ్బందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసింది. సచివాలయ సిబ్బంది & ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు ఆశా వర్క్స్,డ్వాక్రా వీవోఏలు,మండల స్థాయి అధికారులు పాల్గొనున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.గ్రామస్తులందరూ తమ ఇంటి పన్నును సకాలంలో చెల్లించి, పెనాల్టీల నుండి తప్పించుకోవడమే కాకుండా గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని తెలియజేసారు.




# ఘనంగా కవయిత్రి మొల్లమాంభ జయంతి

**జయభేరి, పరవాడ:**



పరవాడ మండలంలోని గోర్లివానిపాలెం కాలనీలో శుక్రవారం తొలి తెలుగు మహిళా కవయిత్రి అయిన అతుకూరి మొల్లమాంభ 586వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంభ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పలువురు ప్రముఖులు మొల్లమాంభ జీవిత విశేషాలు, ఆమె సాహిత్య సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మొల్లమాంభ తెలుగు సాహిత్యంలో తొలి మహిళా కవయిత్రిగా విశిష్ట స్థానం సంపాదించుకున్నారు. ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన గ్రంథాలలో ఒకటిగా నిలిచిందని సాధారణ ప్రజలు కూడా సులభంగా అర్థం చేసుకునేలా సరళమైన, సూటి తెలుగులో రామాయణాన్ని రచించడం ఆమె ప్రత్యేకతగా చెప్పవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో అనకాపల్లి నూకాలమ్మ, వరలక్ష్మి, ఈశ్వరమ్మ, పార్వతి, బాలమ్మ, లక్ష్మి అన్నపూర్ణతో పాటు స్థానిక నాయకులు, సంఘ ప్రతినిధులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని మొల్లమాంభకు ఘనంగా నివాళులు అర్పించారు.



# మన్యంకొండ స్వామిని దర్శించుకున్న మైసూర్ ఉత్తరాది దత్త పీఠ విజయానంద స్వామి

- పూర్ణకుంభంతో స్వామివారి కి ఘనస్వాగతం

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దేవస్థానాన్ని శుక్రవారం మైసూర్ ఉత్తరాది దత్తపీఠ శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వాములవారు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారు దేవస్థానం తో పాటు అనుబంధ దేవాలయం శివాలయం లో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం చరిత్రను విజయానంద స్వామి వారికి చైర్మన్, వ్యవస్థాపక ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ వివరించారు. అలాగే స్వామి స్వామి వారికి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామీజీ వెంట జెపిఎంసి కళాశాల చైర్మన్ రవికుమార్, రిటైర్డ్ ఆర్డీవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తీశ్వరాలయంలో హీరో రోషన్

**జయభేరి, శ్రీకాళహ0స్తి మార్చి 13 :**

శివయ్య దర్శనం మనస్సు కు ఎంతో ప్రశాంతతను ఇస్తుందని సినీ నటుడు రోషన్ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకుని గురుదక్షిణామూర్తి వద్ద వేద పండితులచే ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.హీరో రోషన్ మీడియాతో మాట్లాడుతూ బ్యాండ్ మేళం సినిమా మార్చి 26 న శ్రీరామ నవమి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని స్వామి అమ్మవారిని కోరుకున్నట్లు హీరో రోషన్ తెలిపారు



# నృసింహుని సన్నిధిలో వీరేందర్ జన్మదిన వేడుకలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి 13:**

సంగారెడ్డి చెందిన భక్తుడు ఎస్.వీరేందర్ 54వ జన్మదిన వేడుకలు శుక్రవారం యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఘనంగా జరిగాయి. టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొండ కింద శ్రీ లక్ష్మీ స్వామి వారి పాదాల చెంత వైకుంఠ ద్వారం సమీపంలో భక్తులకు అన్నదానం చేశారు. నమ్మిన వారికి కొంగు బంగారమైన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో వీరేందర్ 54వ జన్మదిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆశీస్సులు తనకు అన్నగారైన వీరేందర్ తో పాటు రాష్ట్ర ప్రజలకు ఉండాలని కోరుకుంటున్నట్లు టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాము,సాయి,నాగభూషణం, చారీ,శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి : ఏఐవైఎఫ్




**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి13:**

డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ సూచించారు. ఈనెల 23న భగత్‌సింగ్, రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన యువజన ఉత్సవాల పోస్టర్‌ను యాదగిరిగుట్టలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లు భవిష్యత్ తరాల కోసం బ్రిటీష్ ముష్కరులను ఎదిరించి వీరోచిత పోరాటాలు చేసి వీరమరణం పొందారన్నారు. కానీ భగత్‌సింగ్ కలలుగన్న స్వరాజ్య ఆకాంక్షలకు అనుగుణంగా నేటి విద్యార్థులు ,యువత పయనించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ స్ఫూర్తితో నేటి యువత చెడు మార్గాలను, చెడు అలవాట్లను విడనాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ పేరబోయిన పెంటయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్,నేతలు శెట్టి నరసింహ,కంబాల శ్రీశైలం, ముత్యాల పెంటయ్య, కంబాల సత్యం,సంఘీ అరవింద్,తోటకూరి శేఖర్, కంబాల రాజు,కంబాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘనలపై పోలీస్ శాఖ చర్యలు




**జయభేరి, పరవాడ:**

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈరోజు ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా మర్రిపాలెం, ఉటగెడ్డ మరియు లంకెలపాలెం ప్రాంతాలలో శుక్రవారం పరవాడ పోలీస్ శాఖ ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు . ఈ తనిఖీలలో పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఎస్ ఐ కృష్ణారావు, భీమారావు మరియు కళ్యాణ్ రాజు పాల్గొన్నారు.ఈ తనిఖీలలో భాగంగా హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్న వాహనదారులపై ప్రత్యేక దృష్టి సారించి, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి చట్టప్రకారం జరిమానాలు విధించారు . ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలనీ రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని వాహనదారులకు వివరించి అవగాహన కల్పించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోవడం, ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలపై కూడా చర్యలు తీసుకోన్నారు మొత్తం మీద 50 మందికి పైగా వాహనదారులపై చట్టప్రకారం జరిమానాలు విధించారు.ఇంకా ప్రతి రోజు కూడా పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు కొనసాగించబడతాయని సీఐ మల్లికార్జున రావు తెలిపారు.

# సకాలంలో ఇంటి పన్నులు కట్టి గ్రామాభివృద్ధికి తోడ్పడండి

- మండల స్థాయి సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ఎన్. సరోజిని

**జయభేరి, పరవాడ :**

పరవాడ మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో పరవాడ మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి మరియు ప్రాజెక్టు డైరెక్టర్ అయినా ఎన్. సరోజినీ అధ్యక్షతన మండల అధికారులతో సమావేశం నిర్వహించి ఆదివారం జరుగు అక్షరాంధ్ర పరీక్షల నిర్వహణపై తగు సూచనలు జారీ చేశారు. స్వర్ణ గ్రామం,స్వర్ణ వార్డు సర్వేలు ఉపాధి హామీ పనుల ప్రగతిపై అలాగే మండలంలో ప్రస్తుతం జరుగుతున్న ఇంటి పన్నుల వసూలు 81 శాతం ఉన్నదనీ దానిని శత శాతం ఇంటి పనులు పూర్తి చేయుటకు గ్రామ పంచాయతీ క్షేత్రస్థాయి సిబ్బందిని ఉపయోగించుకొని ఇంటి పన్నులు వసూలుపై శ్రద్ధ వాహిచాలని తెలియజేసారు.గ్రామాల్లో ప్రజలందరూ సకాలంలో ఇంటి పన్నులు కట్టి గ్రామాభివృద్ధికి తోడ్పడగలరని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఉప మండల అభివృద్ధి అధికారి ఏవి మల్లికార్జున రావు మరియు ఎంఎస్ జీవో ఎం సుభాష్ ఏపీఎం రంగారావు మండల విద్యా శాఖ అధికారి దివాకర్ ఉపాధి హామీ మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత
- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం నిర్వహించిన 2K రన్ లో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వ్యతిరేకంగా నిర్వహించిన మానవహారంలో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చేలా రూపొందించబడిందన్నారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ 5 దశల్లో




5 ప్రత్యేక కార్యక్రమాలు 99 రోజులు జరుగుతాయని తెలిపారు.99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను..ప్రజా ప్రతినిధులు, అధికారులు, అందరం అంకిత భావంతో పని చేసి విజయవంతం చేద్దామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేద్దామన్నారు.

ప్రజాపాలనపట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం మరియు ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ & అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం మరియు వ్యవసాయం, విద్య, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్ర అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో అందరం భాగ్యస్వాములై విజయవంతం చేద్దామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

చదువుకునే వయసులో యువత, చెడు వ్యసనాలకు గురి కాకుండా క్రమశిక్షణతో, మంచి ఆశయాలతో భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, బంగారు భవిష్యత్తు వైపు ముందుకు సాగాలన్నారు. "డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ" కోసం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, పోలీస్ విభాగం కృతనిశ్చయంతో పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. "డ్రగ్స్ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని తెలిపారు.మాదకద్రవ్యాల వినయోగం సమాజాన్ని మానసికంగా, ఆర్థికంగా నాశనం చేస్తుందని, మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని, డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం అందరూ కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---



## ఎమ్మెల్యే బండారును మర్యాదపూర్వకంగా కలిసిన పెందుర్తి నూతన ఎంపీపీ

జయభేరి, పరవాడ:

తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి,మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని శుక్రవారం వెన్నెలపాలెం లో గల ఆయన స్వగృహంలో పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నిక కాబడిన గన్రెడ్డి మాలతి నగేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా ఆవిడా మాట్లాడుతూ ఎంపీపీఎన్నికకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు ఎంపీపీ మాలతి నగేష్ కు స్వీట్ తినిపించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుఖవాసి ప్రసాద్, వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, ఎంపీటీసీలు గండి హిమబిందు భూషణ్, స్వప్నగిరి, మండల కో ఆప్షన్ సభ్యులు శివ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కరక దేవుడు తదితరులు పాల్గొన్నారు.

---

## పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో ఈనెల 14 నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షల ఏర్పాట్లను స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పూర్తి చేశారు. ఈ పరీక్షా కేంద్రంలో దాదాపు 260 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. దేవరకద్ర మండలంలో మొత్తం 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి గాను స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరిటెండెంట్ రామలింగం, డిపార్ట్మెంటల్ అధికారి యం.వేణుగోపాల్, ఇన్విజిలేటర్ శంకర్ నాయక్ తెలిపారు.

---

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

- ఔదార్యం చాటుకున్న జిఎంఆర్ యువసేన
- మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డికి అభినందనల వెల్లువ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం జిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో పరీక్షలు రాయనున్న 10వ,9వ తరగతుల విద్యార్థులకు పరీక్ష, విద్యా సామాగ్రిని అందజేశారు. జిఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో స్థానిక మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి 10, 9వ తరగతులకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులకు జియో మెట్రి బాక్సులతోపాటు ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. దీంతో వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డిని విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా యుగేందర్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పరీక్షలో ఇలాంటి వత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ యువసేన నాయకులు సయ్యద్ జకీ, మున్నూరు నాని, కురువ సన్నీ, వంశీ, విజయ్, సౌండ్ రఘు, డిజె చింటూ, డీజే శీనులతో పాటు తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

---

## పరీక్షలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

- పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు.. ఎస్ఎస్సి పరీక్షలకు పోలీసుల ప్రత్యేక చర్యలు




జయభేరి, షాద్‌నగర్ :

ఫ్యూచర్ సిటీ కమీషనరేట్ పరిధిలో మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల కోసం పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు ఐపీఎస్ తెలిపారు. పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద శాంతిభద్రతల కోసం పోలీస్ సిబ్బందిని మోహరించనున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ల నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలను తరలించే సమయంలో, అలాగే జవాబు పత్రాలను తిరిగి పంపించే సమయంలో ప్రత్యేక ఎస్కార్ట్ బృందాలు భద్రత కల్పిస్తాయని వెల్లడించారు.పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, టాబ్లెట్లు, స్మార్ట్ వాచ్‌లు, పెన్ డ్రైవ్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావడం పూర్తిగా నిషేధమని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గుంపులుగా చేరకుండా ఉండేందుకు బి.ఎన్.ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేపర్ లీకేజీ పుకార్లను అరికట్టేందుకు ప్రత్యేక స్క్వాడ్లు, ముఫ్తీ పోలీసులు నిఘా ఉంచుతారని వెల్లడించారు.విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల జోన్ల నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి ఎక్కడైనా అక్రమాలు లేదా మాల్ ప్రాక్టీస్ జరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---



## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

- విద్యా బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని సివి రామన్ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గా శ్రీనిధి, డీఈవోగా శివాని, ఎం ఈవో గా భార్గవి, సబ్ కలెక్టర్ గా సమన్వి, ప్రిన్సిపల్ గా రింశా షేక్, వైస్ ప్రిన్సిపల్ గా మౌనికలు వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యా బోధనలో ప్రతిభ కనబరిచిన అన్వేతాకు మొదటి బహుమతి, ఆల్ఫా అరేబియాకు రెండో బహుమతి, అంబికా కు మూడో బహుమతి, బెస్ట్ పిఈటిగా కొట్ల అభిరామ్ కు బహుమతులను అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జోభి ధామస్ తెలిపారు.

---

## గోడౌన్ పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ



జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండల కేంద్రంలో శుక్రవారం రూ. 30 లక్షల నిధులతో నిర్మించే ఆహార ధాన్యాల నిల్వకేంద్రం (గోడౌన్) నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) భూమి పూజ చేశారు. అలాగే అడ్డాకుల ప్రభుత్వ వైద్యశాలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కూడా ఎమ్మెల్యే సందర్శించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసిడిన్సులను కూడా ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

---

## మండల కార్యాలయం ముందు బీజేపీ ధర్నా

జయభేరి, శేరిలింగంపల్లి ;

నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ లను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలంటూ శేరిలింగంపల్లి ఎమ్మార్వో కార్యాలయం ముందు బిజెపి నాయకులు ధర్నా నిర్వహించారు. బిజెపి అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణం కోసం నిధులు విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని వాపోయారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం లో నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

---

## పరిశ్రమల్లో హీట్ వేవ్ జాగ్రత్తలు స్ట్రోక్ అవగాహనపై సమావేశం

జయభేరి, పరవాడ:



ప్రస్తుతం కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు, హీట్ వేవ్ పరిస్థితుల నేపథ్యంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్ల ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించేందుకు జెన్పిసి మణుఫాక్చరర్స్ అసోసియేషన్ మరియు ఎంఎస్ఎం సంయుక్త ఆధ్వర్యంలో జెఎన్ ఫార్మా సిటీ పరిధిలోని పరిశ్రమల ఈహెచ్ఎస్ మరియు ఏచ్ఆర్ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న హీట్ వేవ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్కర్ల ఆరోగ్యాన్ని కాపాడేందుకు యాజమాన్యాలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.హీట్ వేవ్ సమయంలో ఉద్యోగులు డీహైడ్రేషన్ మరియు హీట్ స్ట్రెస్ సమస్యలకు గురయ్యే అవకాశం ఉన్నందున అన్ని విభాగాలలో పనిచేసే సిబ్బంది తరచుగా నీరు, మజ్జిగ, గ్లూకోజ్ నీరు వంటి ద్రవాలను తాగాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే కారణంగా అవసరం లేని బయటి పనులను నివారించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే బయట పనులు చేయాలని తెలిపారు. బయట పని చేసే సమయంలో తలకు హెల్మెట్ లేదా టోపీ ధరించడం, నీడలో విశ్రాంతి తీసుకోవడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల సేఫ్టీ విభాగం, యాజమాన్యాలు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఉద్యోగులు అందరూ సేఫ్టీ సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా, భద్రంగా పనిచేయాలని సమావేశంలో పాల్గొన్న అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో JN ఫార్మా సిటీ పరిధిలోని వివిధ ఫార్మాస్యూటికల్ పరిశ్రమల సేఫ్టీ, ఏచ్ఆర్ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

## ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

- దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్
- కొత్తకోటలో ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు

జయభేరి, దేవరకద్ర :




ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి (పీహెచ్సీ) లో శుక్రవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సన చారిటబుల్ ట్రస్ట్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపును దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సన చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తల్లిదండ్రులను అభినందించి, వారి ట్రస్ట్ సేవలను ఎమ్మెల్యే జియంఆర్ కొనియాడారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జియంఆర్ ప్రసంగించారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫ్రీ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులను, వైద్య శిబిరాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాన్సర్ ను ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ప్రాణాంతకం కాదన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. తదనంతరం టీబీ వ్యాధి బారిన పడి కోలుకున్న వారికి సన ట్రస్ట్ ద్వారా హెల్త్ కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

---

## ఘనంగా వాసవి మాత పల్లకి సేవ

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం





వాసవి మాతా పల్లకి సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం వాసవి మాత పల్లకి సేవ కార్యక్రమాన్ని దేవాలయంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకుడు తరిమల హరిశంకర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఉదయం 8:30 గంటలకు అమ్మవారికి అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అమ్మవారి శ్రీ చక్రాలకు కుంకుమార్చన కార్యక్రమాన్ని, లలితా సహస్రనామ పారాయణం, అమ్మవారికి మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. పూజా కార్యక్రమానికి హాజరైన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షు కల్వ కన్నయ్య శెట్టి, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి, జిల్లా విశ్వహిందూ పరిషత్ మాజీ అధ్యక్షులు గుద్దేటి చంద్రయ్య, యువజన సంఘం అధ్యక్షుడు దోమ హరికాంత్ లతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేసిన C S ఫౌండర్, చైర్మన్




**జయభేరి, పీఏ పల్లి :**

10వ తరగతి పరీక్షలు రాసే ప్రతి విద్యార్థులకు C S ఫౌండర్, చైర్మన్ క్రింది విధంగా సూచనలు తెలియజేసినారు. ప్రతి రోజు రాత్రిపూట 10 గంటల దాక చదవండి. తెల్లవారు ఝామున 4.30 లకు నిద్రలేవండి. మనసులో ఆందోళన లేక ప్రశాంతంగా వుండండి. ఎట్టి పరిస్థితులలోను రాత్రి పూట నిద్రాభంగం కానివ్వకండి. ఉదయం 4.30 to 6.30 వరకూ చదవండి. మధ్యలో కాస్త ఎక్సర్సైజ్ (యోగ, ధ్యానం) చేయండి. ఒక అరగంట విశ్రాంతి తీసుకోండి. అరగంట కాల కృత్యాలకు, స్నానానికి కేటాయించండి. తర్వాత పుస్తకం తిరగెయ్యండి. పౌష్టికాహారం లైట్ గా తీసుకోండి. ఉదయం 8.30 కల్లా దూరం వారు, 8.45 కల్లా దగ్గర వారు పరీక్షకు బయలుదేరండి. 8:30 నుండి తొమ్మిదిన్నర వరకు గంట సేపు ఎవరితో మాట్లాడకండి. 8.50 కల్లా పరీక్ష కేంద్రానికి చేరుకోండి. తోటి విద్యార్థులతో మాట్లాడకండి. ప్రశాంతం గా పరీక్ష హాలు లోకి చిరునవ్వుతో వెళ్ళండి. ఉపాధ్యాయులు చెప్పే సూచనలు గమనించండి. జవాబు పత్రం ఇవ్వగానే దానికి మార్జిన్లు కొట్టండి. ప్రశ్నాపత్రం క్షుణ్ణంగా చదవండి. బాగా వచ్చిన ప్రశ్నలు ముందుగా వ్రాయండి. తప్పులు, కొట్టివేతలు లేకుండా వ్రాయండి. రాసేటప్పుడు, ప్రశ్న నెంబరు, సెక్షన్ రాయండి. జవాబు అవ్వగానే గీత కొట్టండి. మరొక ప్రశ్నకు ఉపక్రమించండి. ముందు అన్ని తెలిసిన ప్రశ్నలు తప్పులు లేకుండా వ్రాయండి. చివరకు, తెలియని ప్రశ్నలు, ఛాయస్ ట్రై చేయండి. గుర్తు రాకపోతే చిరునవ్వుతో మూడుసార్లు ఊపిరి పూర్తిగా పీల్చుకొని వదలండి స్ట్రెస్ మొత్తం వెళ్ళిపోతుంది మర్చిపోయిన విషయాలు గుర్తొస్తాయి. చివరి 15 నిముషాలు వ్రాసిన పేపర్ ని ఒకసారి పరిశీలించండి. తప్పులు, ప్రశ్న నెంబర్లు సరి చూడండి. Map, graph booklet తర్వాత దారం తో కట్టండి. ముందు తెలిసినవి వ్రాసి, చివరగా ఆలోచించి అసలు ఏది వదలకుండా పూర్తి చేయండి. వార్నింగ్ బెల్ కొట్టినా లేవకండి. అన్ని పరిశీలించాక తృప్తి గా బయటకు రండి. జరిగిన పరీక్షలలో పొరబాటున ఏదైనా తప్పు రాస్తే దానినే పట్టుకుని వేళ్ళాడకండి.. నేరుగా ఇంటికి వెళ్లి లంచ్ చేసి, ఒక గంట నిద్రించండి. తరువాత రెండు గంటల వ్యవధిలో మధ్య మధ్య లో 15 నిముషాలు గ్యాప్ ఇస్తూ చదవండి. బొమ్మలు, గ్రాఫ్ పేపర్ మీద పెన్సిల్, మ్యాప్ స్పష్టంగా గుర్తించండి. బుద్ధిమంతులుగా ఉండండి. కాపీ అనే ఆలోచన మనసులోకి రానీయకండి. చక్కని జయాన్ని అందుకుని అమ్మ, నాన్నల, మీ ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చండి. జయం మీదే, విజయం మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే అని C S ఫౌండర్, చైర్మన్ గోలి గిరి తెలియజేసినారు.

# కుమ్మరుల ఆణిముత్యం మొల్ల

**జయభేరి, దేవరకొండ :**



రామాయణాన్ని సరళమైన భాషలో తెలుగులో అనువదించిన తొలి తెలుగు కవయిత్రి కుమ్మరుల ఆణిముత్యం అని ఉన్నారు. తొలి తెలుగు మహిళా కవయిత్రి శ్రీ శ్రీ శ్రీ మొల్లమాంబ జయంతి వేడుకను దేవరకొండ నియోజకవర్గం కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు తోటపల్లి కిరణ్ మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులో స్పష్టమైన పదజాలంతో రచించిన ఆతుకూరి మొల్ల గారు మా కులంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆమె స్వయాన దైవాంశ సంభూతురాలు కావడంతో శ్రీరామ చంద్ర భక్తురాలై కవితలు రాసిందన్నారు. 16వ శతాబ్దం శ్రీ కృష్ణదేవరాయల కాలంలో బహుముఖ ప్రజ్ఞాశాలు అయిన కవులలో ఒకరిగా పేరొందడం గర్వకారణం అన్నారు. అలాంటి మహానుభావురాలి జయంతి వేడుకను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముల్లమాంబ జయంతి వేడుకను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి ఎల్లయ్య, నీలకంఠం రాములు, ఏరుకొండ రాము, మాడుగుల యాదగిరి, బొడ్డుపల్లి మల్లయ్య, తోటపల్లి వెంకటయ్య, తోటపల్లి శ్రీను, సిలువేరు శ్రీధర్, తోటపల్లి శ్రీనివాస్, గణపురం యాదగిరి, బొడ్డుపల్లి మల్లికార్జున్, బొడ్డుపల్లి రామకృష్ణ, బొడ్డుపల్లి మల్లేష్, నెల్లికంటి గోపి, వెంకటాపురం నగేష్, శివ, తోటపల్లి వెంకటేష్, శంకర్, కిరణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జయభేరి, చింతపల్లి :**



రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చింతపల్లి మండల కేంద్రంలో నేడు ఘనంగా నిర్వహించిన దావత్ఏఇఫ్తార్ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ ప్రార్థనల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలు శాంతిసమృద్ధులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది త్యాగం, సహనం, దాతృత్వం సోదరభావాన్ని పెంపొందించే పవిత్రమైన నెల అని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు పాటించే ఉపవాస దీక్ష సమాజానికి ఆత్మ నియంత్రణ, పరస్పర సహకారం వంటి విలువలను నేర్పుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనారిటీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, మైనారిటీ సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ భవానీ పవన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగభూషణం, మాజీ సర్పంచ్ ముచర్ల గిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మైనార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలి

**జయభేరి, పరకాల, మార్చి 13:**



శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని పరకాల మున్సిపాలిటీ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ అధ్యక్షతన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని, పట్టణ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రజల సమస్యలను గుర్తించి వాటికి తక్షణ పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అలాగే తాగునీరు, పారిశుధ్యం, తదితరా అంశాలపై చర్చించారు. పట్టణ కేంద్రంలో పెండింగ్లో ఉన్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.




# దుండిగల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సస్పెన్షన్

**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ జోన్ దుంగిడల్ సర్కిల్లో పని చేస్తున్న టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ (TPS) సంజనను అవినీతి ఆరోపణలతో సస్పెండ్ చేశారు. జోనల్ కమిషనర్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిబ్రవరి 19న ACB అధికారులు దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనధికారిక నగదు లావాదేవీలు ఆమె భర్తకు చెందిన సంస్థకు మళ్లించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో భాగంగా చర్యలు తీసుకున్నారు.






# చెరువులోకి కారు.. కేసు నమోదు...

- షాద్ నగర్ సీఐ కె. సీతారాం వెల్లడి
- కారును బయటకు తీసిన పోలీసులు, డిఆర్ఎఫ్ బృందం..
- మద్యం మత్తులో నిర్లక్ష్యం వల్లనే చెరువులోకి

**జయభేరి, షాద్ నగర్ :**

మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కారు నడపడంతో అది చెరువులోకి వెళ్లిపోయిన సంఘటన షాద్ నగర్ పురపాలక పరిధిలోని చటాన్ పల్లి సురసముద్రం చెరువు వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. దీనికి సంబంధించి చెరువులో గాలింపులు చేపట్టిన పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాలు కారును బయటకు తీశారు. కారు నెంబర్ సహాయంతో ఓనర్ వివరాలు తెలుసుకోగా కాజ్జాం రామంత అని తెలిసింది. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగిర్ పరిధిలోని ర్యాలీ కాలనీలో నివాసం ఉండే ఆయనకు సమాచారం ఇవ్వగా అతని కారును హైదరాబాద్ అత్తాపూర్ లోని నలంద నగర్ కు చెందిన శ్రీకాంత్ రెడ్డి అభ్యర్థన మేరకు ఇచ్చినట్లు తెలిపారు. కాగా శ్రీకాంత్ రెడ్డి, నరేష్లు మద్యం తాగి కారును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లనే చెరువులో పడి పూర్తిగా డ్యామేజ్ అయింది. అయితే ఇందులో ప్రాణ నష్టం జరగలేదు. యజమాని రామంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు పట్టణ సిఐ కె సీతారాం మీడియాకు తెలిపారు.

# ఎల్.పి.జి గ్యాస్ కు ఎలాంటి కొరత లేదు

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి




**జయభేరి, రంగారెడ్డి జిల్లా :**

రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ కొరత లేదని జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని, వందతులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. అమెరికాఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో చమురు, ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడనుందని వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని, యుద్ధం ప్రభావం వలన జిల్లాలో ఎలాంటి ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ఇంతకు ముందు గ్యాస్ బుక్ చేసుకున్నా తరువాత సరఫరా ఉన్నట్లే ప్రస్తుతం కూడా అదే విధంగా గ్యాస్ సరఫరా ఉంటుందని, ఎలాంటి జాప్యం ఉండదని, జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, గృహ అవసరాలకు వినియోగించే ఎల్.పి.జి గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని, అదేవిధంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని తెలుపుతూ, జిల్లా ప్రజలు గ్యాస్ పై వస్తున్న అవాస్తవాలను, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.



# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 13 :**

తుర్కపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ పి మంజూషా రాణి తెలిపారు. తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్లో 213 మంది ,మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 183 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. మండలంలో 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒకటి మోడల్ స్కూల్, ఒకటి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ఒకటి పడాల ముత్యాలు మెమోరియల్ పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు తెలిపారు. ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

# కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలి



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 13 :**

కేజీబీవీ, యుఆర్ఎస్, ఎస్ ఎస్ లలో పనిచేసే బోధన, బోధనేతర ఎంఆర్సి సిబ్బంది సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా జరుగుతున్న పోరాటంలో భాగంగా ఈనెల 16న కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పి. బిక్షమయ్య అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని కస్తూరిబా పాఠశాలలో కరపత్రాలను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలనుండి చాకిరిలాగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం మానవతా దృక్పథంతో సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ రాష్ట్ర నాయకురాలు లక్ష్మి, ఎస్ఓ అనిత, యుటిఎఫ్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, ఎల్ల స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 13 :**


తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం సిసి రోడ్డు పనులను సర్పంచ్ తునికి లక్ష్మీరామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా 10 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాటికొండ నరసింహులు, వార్డు సభ్యులు కొంతం సునీత, కొంతం కళ్యాణి, ఏసబోయిన నాగరాజు, ఎయ్యాంల కనకరాజు, వల్లపు రేఖ, నల్ల మహేష్, మన్నే మహేష్ లింగాల కనకయ్య, కొంతం అనురాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవ వేడుకలు

**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 13 :**

తుర్కపల్లి మండలం జేతురామ్ తండ లోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కరోజు ఉపాధ్యాయుల యొక్క పాత్రను విద్యార్థులు సంతోషంగా నిర్వర్తించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ భవిష్యత్తులో అత్యంత స్థానంలో చేరుకోవాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యమని విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అవసరమని విద్యార్థుల లక్ష్యసాధనలో కావలసిన వసతులను తప్పకుండా కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏపిసి చైర్మన్ నునావత్ కవిత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీణా దేవి, ఉపాధ్యాయులు ప్రతిభ బాసిని అంగన్వాడి టీచర్ సంతోష, విద్యార్థులు పాల్గొన్నారు.


# ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు



**జయభేరి, తుర్కపల్లి, మార్చ్ 13 :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను మండల కుమ్మరి సంఘం కమిటీ అధ్యక్షుడు దేవరుప్పల ఐలయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమ్మరి కులానికై వన్నెతెచ్చిన రామాయణ రచయిత్రి మొల్లమాంబ జయంతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మార్చి 13న అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు, కోశాధికారి జాగిల్లపురం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అల్లం దుర్గం కర్ణాకర్, ప్రచార కార్యదర్శి కొండల్, చివిలికపల్లి రాములు, తిగుళ్ల బాలకృష్ణ ,ఇంద్రపాలకృష్ణ, రేణిగుంట భాస్కర్, నాగాయపల్లి మల్లేష్, నాగయ్య పల్లి శ్రీనివాస్, పేరాల రాజు, ఆలేటి శ్రీశైలం, దుబ్బాక వెంకటేష్, బేతాళ కనకయ్య గణేష్, కిషన్, బిక్షపతి పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లపై అపోహలు వద్దు



- ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో దేశానికి సరఫరాలు కొనసాగుతున్నాయి: ఏనుగు సుదర్శన్ రెడ్డి
- ఘట్కేసర్ ఈశ్వర ఏజెన్సీ సందర్శన... జిల్లా సివిల్ సప్లై అధికారులు, ఐఓసీఎల్ అధికారులతో మాట్లాడి పరిస్థితులపై సమీక్ష

**జయభేరి, ఘట్కేసర్ :**

ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో సోషల్ మీడియాలో గ్యాస్ సిలిండర్ల కొరతపై వస్తున్న అపోహలకు ప్రజలు లోనుకాకూడదని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఘట్కేసర్‌లోని ఈశ్వర ఏజెన్సీ గోదాం, కార్యాలయాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం



ఐఓసీఎల్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి గ్యాస్ సరఫరా పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో ప్రపంచంలోని పలు దేశాల నుంచి ఇంధన, గ్యాస్ సరఫరాలు నిరంతరం కొనసాగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా భారత దేశ ప్రజలకు ఎలాంటి హాని కలగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తంగా పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. జిల్లా సివిల్ సప్లై అధికారులతో కూడా మాట్లాడి గ్యాస్ సరఫరా పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం కొంతవరకు సిలిండర్ల కొరత ఉన్నది వాస్తవమేనని, అయితే ప్రజలు అనవసరంగా భయపడకుండా అవసరం ఉన్నవారే మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే బుకింగ్ చేసి డెలివరీ పొందిన తర్వాత మళ్లీ బుకింగ్ కోసం ఆఫీసుల చుట్టూ తిరగకుండా ప్రజలు సహకరించాలని కోరారు. అలాగే ఏజెన్సీ సిబ్బంది లేదా డెలివరీ బాయ్స్ ఎవరైనా గ్యాస్ సిలిండర్లను బ్లాక్‌లో అమ్మితే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా ప్రభుత్వ సూచనలను పాటిస్తూ సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ బిజెపి ప్రధాన కార్యదర్శి చెల్లక శ్రీధర్, సీనియర్ నాయకులు రాజేష్, మేనేజర్ వెంకటేష్, గోడౌన్ ఇంచార్జి సుమన్, డెలివరీ ఏజెంట్ రఫిక్, ఆపరేటర్స్, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే

**జయభేరి, చందంపేట :**

చందంపేట మండలంలోని ముర్పునుంతల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ మన్మధ రెడ్డి శాలువతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లు మంచినీరు విద్యుత్తు సౌకర్యంతో పాటు వివో భవనాలను నిర్మిస్తూ గ్రామపంచాయతీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ మౌలిక సదుపాయాలను ఎమ్మెల్యే బాలు నాయక్ సహకారంతో చేపడుతానని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కటకం లక్ష్మమ్మ అంగన్వాడి టీచర్ ను సన్మానించిన

- CDPO సక్కుబాయి



**జయభేరి, చింతపల్లి :**

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్గొండ కలెక్టర్ కార్యాలయం లో చింతపల్లి మండలం గడియ గౌరారం అంగన్వాడి టీచర్ కటకం లక్ష్మమ్మ ఉత్తమ అంగన్వాడి టీచర్ గా CDPO సక్కుబాయి అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో CDPO సక్కుబాయి సూపర్వైజర్లు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రంలో విద్యార్థి అస్వస్థత..

- వెంటనే స్పందించిన 108 సిబ్బంది



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 13:**

పరీక్ష కేంద్రంలో ఓ విద్యార్థి కళ్ళు తిరిగి పడిపోయింది. ఈ సంఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. మనోహరాబాద్ మండలం తుపాకులపల్లి గ్రామానికి చెందిన స్పందన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. అయితే శుక్రవారం మేడ్చల్ లోని స్ఫూర్తి కళాశాలలో ఒకేషనల్ పరీక్ష రాస్తుండగా ఒక్కసారిగా కడుపు నొప్పితో బాధపడుతూ కళ్ళు తిరిగి పడిపోయింది. దీంతో వెంటనే కళాశాల సిబ్బంది అప్రమత్తమై 108 సిబ్బందికి సమాచారం అందించడంతో ఈ ఏం టీ సీతారాం, పైలట్ కరుణాకర్ లు ఘటన స్థలానికి చేరుకుని వైద్యులు జగదీష్ సలహాలు, సూచనలు పాటిస్తూ ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థి క్షేమంగా ఉందని, యథావిధిగా పరీక్ష రాసిందని కళాశాల సిబ్బంది తెలిపారు. కాగా సకాలంలో స్పందించి తమ కూతుర్ని ప్రాణప్రాయ స్థితి నుండి కాపాడిన 108 సిబ్బంది మరియు కళాశాల సిబ్బందికి విద్యార్థి తల్లి దండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అయ్యప్ప భక్తులు సిరిశెట్టి రాజేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందచేత..

- 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప సేవా చారిట్రబుల్ ట్రస్ట్



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 13:**

శామీర్ పేట కు చెందిన సిరిశెట్టి రాజేష్ శబరిమలలో మృతి చెందారు. కాగా వారి కుటుంబానికి శ్రీ పరిపూర్ణ పుష్కల సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప సేవ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ఇందులో భాగంగా ట్రస్ట్ ఫౌండర్ వాకా చంద్ర శేఖర్ రెడ్డి గురు స్వామి సహకారంతో సత్యం గురుస్వామి ఆధ్వర్యంలో స్వర్గీయ సిరిశెట్టి రాజేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సిరిశెట్టి రాజేష్ ఏబిఏపి సంస్థలో సామాన్య సభ్యుడిగా చేరి అనతి కాలంలోనే జాతీయ కార్యదర్శిగా ఎదిగి అయ్యప్ప స్వామి భక్తులకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏబిఏపి కుటుంబ సభ్యులు అందరికీ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంచి శ్రీనివాస్ రెడ్డి, జాతీయ పీఆర్ఓ రాయబారపు రావిరాజు, గురవయ్య, గురుస్వామి మల్లేష్, మధు, సామల బుచ్చిరెడ్డి, అయ్యప్ప భక్తులు వట్టెల సాయికుమార్, వెంకటపురం రాజు తదితరులు పాల్గొన్నారు..



## మున్సిపల్ లో నీటి ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తా: చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మర్చి 13:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అలియాబాద్ లోని పిట్టల గూడ లో గల వాటర్ ట్యాంక్ ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డు లలో క్రమం తప్పకుండా మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి, ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని సిబ్బంది కి సూచించారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో అన్ని వార్డుల్లో ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో అందరూ పాలుపంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ చంద్ర శేఖర్, కౌన్సిలర్లు గుర్క కుమార్ , గూడె వెంకటేశ్ , యమున శ్యామ్,ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు , ఇంచార్జి రెవెన్యూ ఇనస్పెక్టర్ విజయ్ కుమార్, పట్టణ నాయకులు, ప్రజలు సభ్యులు పాల్గొన్నారు.

## నిచ్చెన పైనుండి పడి మృతి

- తల్లి మరణంపై అనుమానాలను వ్యక్తం కుమార్తెలు



**జయభేరి, హయాత్ నగర్ :**

వినాయక నగర్ కాలనీ, పసుమములు, ఇంటి నెం. 373/13/257/A/1 వద్ద శుక్రవారం ఉదయం 07:30 గంటల సమయంలో ఒక మరణం సంభవించింది. మృతురాలిని సుమారు 39 ఏళ్ల వయస్సు గల 'పనస ఉమారాణి'గా గుర్తించారు. ప్రాథమిక విచారణ ప్రకారం, ఆమె తన దైనందిన పనులలో భాగంగా, బాత్‌రూమ్ పైకప్పుపై ఉంచిన చీపురును తీసుకోవడానికి నిచ్చెన ఎక్కిన సమయంలో, ఒక పెయింట్ డబ్బా ఆమెపై పడింది. దాంతో ఆమె నిచ్చెన పైనుండి కిందకు పడిపోయి గాయాల పాలయ్యారు. ఆమెను వెంటనే యశోద ఆసుపత్రికి తరలించగా, అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు ఆమెను పరీక్షించి, అప్పటికే మరణించినట్లు (brought dead) నిర్ధారించారు. అయితే, మృతురాలి కుమార్తెలు తమ తల్లి మరణంపై అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం పరీక్ష నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కావున, ఈ ఘటనపై క్రైమ్ నెం. 417/2026, సెక్షన్ 194 BNSS కింద కేసు నమోదు చేయబడుతుంది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి దర్యాప్తు చేపట్టబడుతుంది.

## జవహర్ నగర్ లో ఆటో డ్రైవర్ల ధర్నా

- ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎత్తివేయాలి
- గ్యాస్ రేట్లు తగ్గించాలి రాపిడో ఓలా ఉబర్ లను రద్దు చేయాలి




**జయభేరి, కీసర :**

మల్కాజ్గిరి జోన్ కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నగర్ ప్రధాన రహదారిపై ఐకమత్యం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటోలు నడుపుతూ అరకొర సంపాదనతో జీవనం కొనసాగిస్తున్న ఆటో డ్రైవర్ల కుటుంబాల బతుకులు గ్యాస్ రేట్లు ఆకాశాన్ని అంటడంతో రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు, రాపిడో, ఓలా, ఉబర్, లాంటి సౌకర్యాల ఏర్పాటు వల్ల ఆటో డ్రైవర్ల నడ్డి విరిగిందని ఆటో నడపడమే జీవనాధారంగా శ్రమించే ఆటో కార్మికుల బతుకులు దుర్భరమై అధోగతి పాలయ్యాయని ఆందోళన చెందుతున్నారు. ఆటో నడపడం తప్ప వేరే పని తెలియక చాలీ చాలని సంపాదనతో కుటుంబాన్ని పోషించుకోలేక కష్టాల కొలిమి నుండి బయటపడలేక కొందరు ఆటో కార్మికులు మనస్థాపంతో గుండెపోటు కు గురై మరికొందరు ఆత్మహత్యలు చేసుకుని అసువులు బాసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయని ఉద్వేగానికి గురవుతున్నారు, ఇకనైనా ఆటో డ్రైవర్ల మనోవేదనను గ్రహించి గ్యాస్ రేట్లను తగ్గించాలని ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎత్తివేయాలని రాపిడో, ఓలా, ఉబర్ సౌకర్యాలను కూడా రద్దు చేసి ఆటో కార్మికుల బతుకులను చక్కదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. లేనియెడల కడుపు రగిలిన ఆటో కార్మికులం అందరం ఉద్యమ స్ఫూర్తితో పోరాటాలతో ముందుకు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు: మున్సిపల్ చైర్మన్ జాం రవి



**జయభేరి, శామీర్ పేట్, మర్చి 13:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ మరియు లక్ష్మాపూర్ తండాలో శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా రహదారులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జాం రవి , కమిషనర్ పవన్ కుమార్ లు పాల్గొన్నారు పాల్గొన్నారు . అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఒక చక్కటి కార్యక్రమం అని, దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిలో పాలుపంచుకోవాలని వారు కోరారు. అదేవిధంగా మున్సిపల్ పరిధిలో పెండింగ్ పనులు దశల వారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీవాణి, చిన్నలచ్చ సరిత, నవీన్ నాయక్, ర్యాకల నీరజ్ గౌడ్ , మేనేజర్ ఉష , శానిటరీఇన్స్పెక్టర్ మోహన్ సింగ్ , లక్ష్మాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపి, రామాలయ చైర్మన్ చిత్తయ్య గౌడ్, మరియు మాజీ ఉప సర్పంచ్ కటికల వైద్యనాథ్,బి ఆర్ ఎస్ నాయకులు శ్రీనివాస్ , బండి రవీందర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ , బి ఆర్ ఎస్ నాయకులు సౌకారి మాజీ సర్పంచ్ సింగం ఆంజనేయులు, కీసరి వెంకట్, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు మరియు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణాభివృద్ధికి పోస్టల్ శాఖ సేవలు విస్తరణ

- పోస్టల్ శాఖలో నూతన పథకాలు అమల్లోకి: జి. సంపత్ రెడ్డి




**జయభేరి, శామీర్ పేట్, మర్చి 13:**

పోస్టల్ సేవలను మరింత విస్తరింప చేయనున్నట్లు అసిస్టెంట్ సూపరింటెండ్ ఆఫ్ పోస్టల్ అధికారి జి . సంపత్ రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో డాక్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సంపత్ రెడ్డితో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోస్టల్ శాఖ లో సరి కొత్త పథకాలు అమలులోకి వచ్చాయని, ఇందులో భాగంగా సుకన్య సమృద్ధి ఖాతా, డిపాజిట్ స్కీమ్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మంత్లీ ఇన్ కం స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, తపాలా జీవిత బీమా, టైమ్ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, అటల్ పెన్షన్ యోజన,పీ ఎం ఎస్ బి వై ,పి ఎం జె జె బి వై, ఇన్సూరెన్స్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకింగ్ తదితర సేవలను ప్రజలకు వివరించారు.

అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి మాట్లాడుతూ పోస్టల్ శాఖ నూతనంగా తీసుకువచ్చిన పథకాలను ప్రతి ఒక్కరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట సబ్ పోస్ట్ మాస్టర్ సుధీర్, లాల్ గడి మలక్ పేట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రేణుక,, ఆయా గ్రామాల బ్రాంచ్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్ధకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం


జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్‌డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇర్రిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.





# అన్నీ అట్టర్ ఫ్లాప్..

దిగంగన సూర్య వంశీ. బాలీవుడ్ బుల్లితెరపై పలు సీరియల్స్ చేసింది. చైల్డ్ ఆర్టిస్టుగా అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మ ఆ తర్వాత కథానాయికగా అలరించింది. హిప్పీ సినిమాతో నటిగా తెరంగేట్రం చేసింది. కానీ ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత తెలుగులో గోపీచంద్ నటించిన సీటీమార్ సినిమాలో నటించింది. ముఖ్యంగా ఈ సినిమాలో తమన్నానే డామినేట్ చేసింది. అలాగే ఆది సాయి కుమార్ క్రేజీ ఫెలో మూవీలో ఈ ముద్దుగుమ్మ నటిగా కనిపించింది. కానీ తెలుగులో ఈ అమ్మడు నటించిన సినిమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. 1997లో అక్టోబర్ 15న జన్మించిన దిగంగన సూర్య వంశీ... తెలుగు, హిందీ భాషలలో తనదైన ముద్ర వేసింది. ఇప్పుడు తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ ముద్దుగుమ్మ.. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. అలాగే నెట్టింట నిత్యం గ్లామరస్ ఫోటోస్ షేర్ చేస్తూ సందడి చేస్తుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. ఈ బ్యూటీకి 1 మిలియన్ కు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ప్రస్తుతం దిగంగన సూర్య వంశీ షేర్ చేసిన గ్లామరస్ ఫోటోస్ కట్టిపడేస్తున్నాయి.



# కొత్త ప్రేమకథకు సిద్ధం!

తెలుగు సినీ పరిశ్రమలో సహజసిద్ధమైన కథలు, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. ఆయన సినిమాల్లో కనిపించే సహజత్వం, సున్నితమైన భావాలు, జీవనానికి దగ్గరగా ఉండే పాత్రలు ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. 'డాలర్ డ్రీమ్స్' చిత్రంతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శేఖర్ కమ్ముల తర్వాత 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్', 'లీడర్', 'ఫిదా' వంటి చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్నారు. ముఖ్యంగా ప్రేమకథలను సహజంగా చెప్పడంలో ఆయనకు ఉన్న ప్రత్యేకత యువతలో మంచి క్రేజ్‌ను తెచ్చిపెట్టింది. కథలోని ఎమోషన్స్‌ను సున్నితంగా చూపించడం, పాత్రల సహజత్వాన్ని కాపాడటం, సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం శేఖర్ కమ్ముల సినిమాల ప్రధాన లక్షణాలు. అందుకే ఆయన సినిమాలు సాధారణ కథలే అయినప్పటికీ ప్రేక్షకుల హృదయాలను తాకే విధంగా ఉంటాయి. ఇక తాజాగా శేఖర్ కమ్ముల మరోసారి నాగ చైతన్య తో కలిసి సినిమా చేయబోతున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన లవ్ స్టోరీ మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కాంబో మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ కొత్త సినిమాకు సంబంధించి ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని తెలుస్తోంది. షూటింగ్ వచ్చే నెలలో ప్రారంభమయ్యే అవకాశముందని చెబుతున్నారు. ఈ సినిమా కూడా భావోద్వేగాలతో కూడిన ప్రేమకథగా ఉండే అవకాశం ఉందని సమాచారం. శేఖర్ కమ్ముల స్టైల్‌కు తగ్గట్టుగా సహజమైన కథతో పాటు బలమైన భావోద్వేగాలు ఈ సినిమాలో ప్రధానంగా ఉండనున్నాయట. 2021లో విడుదలైన 'లవ్ స్టోరీ' చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాలో నాగచైతన్య రేవంత్ పాత్రలో కనిపించగా, సాయి పల్లవి మౌనికగా నటించింది. కులాంతర ప్రేమ నేపథ్యంతో తెరకెక్కిన ఈ సినిమా సమాజంలో ఉన్న కొన్ని సమస్యలను స్పృశిస్తూ రూపొందించడం జరిగింది. ఈ చిత్రానికి పవన్ అందించిన సంగీతం సినిమాకు పెద్ద ప్లస్‌గా నిలిచింది. అందులోని 'సారంగదరియా' పాట దేశవ్యాప్తంగా భారీగా పాపులర్ అయింది. సుమారు 30 కోట్ల బడ్జెట్ తో రూపొందిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు 100 కోట్లకు చేరువగా వసూళ్లు సాధించి కమర్షియల్‌గా కూడా మంచి విజయాన్ని అందుకుంది. దీంతో శేఖర్ కమ్ముల – నాగచైతన్య కాంబినేషన్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఏర్పడింది. ఇక నాగచైతన్య కెరీర్ విషయానికి వస్తే, ఏ మాయ చేశావే సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆయన తర్వాత 'మజిలీ', 'లవ్ స్టోరీ', 'తండేల్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల ఆదరణ పొందారు. మరోవైపు శేఖర్ కమ్ముల కూడా కంటెంట్ ఆధారిత సినిమాలతో దర్శకుడిగా తన ప్రత్యేకతను కొనసాగిస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాబోతుందన్న వార్తలతో సినీ అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# సంక్రాంతి కండీషన్



అగ్రహీరో బాలకృష్ణ కథానాయకుడిగా మలినేని గోపీచంద్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో యాక్షన్ సీక్వెన్స్‌తో ఈ సినిమా షూటింగ్ మొదలైంది. కేవలం రాత్రుళ్లు మాత్రమే ఈ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాను ఎట్టిపరిస్థితుల్లో దసరాకి విడుదల చేయాలనే కసితో చిత్రబృందం పనిచేస్తున్నది. వెంకటసతీష్‌కిలారు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఈ సినిమాతోపాటే సమాంతరంగా మరో సినిమా చేయాలనే ఆలోచనలో బాలకృష్ణ ఉన్నారు. త్వరలోనే ఆ సినిమా షూటింగ్‌ను మొదలుపెట్టి, సంక్రాంతికి విడుదల చేయాలనేది బాలకృష్ణ ఉద్దేశ్యం.అయితే.. దీనికి దర్శకులైతే సిద్ధంగా ఉన్నారు కానీ, కథ మాత్రం సిద్ధంగా లేదు. బాలకృష్ణ ఇమేజ్‌కు తగ్గట్టు లార్జర్ దేన్ లైఫ్ తరహా కథను వండే పనిలో దర్శకులున్నారు. ఈ మధ్య అగ్ర నిర్మాతలు దిల్‌రాజు, సూర్యదేవర నాగవంశీ, మైత్రీ అధినేతలు నవీన్, రవిశంకర్‌లు బాలకృష్ణకు కొందరు దర్శకులతో కథలు చెప్పించారట. వివేక్ ఆత్రేయ, హరీష్‌శంకర్, 'దండుపాళ్యం' ఫేం శ్రీనివాసరాజు, 'మార్కో'ఫేం హనీఫ్ తదితరులు బాలకృష్ణకు కథలు వినిపించినవారిలో ఉన్నారు. వీరుగాక మరికొందరు దర్శకులు త్వరలో బాలకృష్ణకు కథలు వినిపించనున్నారు. వీరిలో ఎవరి కథకు బాలకృష్ణ గ్రీన్ సిగ్నల్ ఇస్తే వారి సినిమా సెట్స్ పైకి వెళ్తుంది. అదే సంక్రాంతి బరిలో ఉంటుంది.

# ఎంత మారిపోయింది భయ్యా.. పూరి జగన్నాథ్ కూతురిని చూశారా..




తెలుగు సినిమా ప్రపంచంలో డైరెక్టర్ పూరి జగన్నాథ్ సినిమాలకు సెపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. చాలా కాలంగా ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో తనదైన ముద్ర వేశారు. పూరి సినిమా అయితే చాలు హీరోహీరోయిన్ల గురించి జనాలు అంతగా పట్టించుకోరు. యువతను ఆకట్టుకునే కథలు.. డైలాగ్స్ తో కుర్రకారును ఉర్రూతలూగిస్తారు. అలాగే కుర్రకారు మెచ్చేలా హీరో పాత్రలకు యాటిట్యూడ్, ఎలివేషన్ ఇస్తుంటారు. అందుకే పూరి సినిమాలకు, ఆయన మేకింగ్, డైరెక్షన్ అంటే కుర్రాళ్లు పడిచచ్చిపోతారు. ఒకప్పుడు ఎన్నో సూపర్ హిట్ చిత్రాలతో ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన పూరి.. ఇప్పుడు సరైన హిట్టు కోసం వెయిట్ చేస్తున్నారు. కొన్నాళ్లుగా ఆయన తెరకెక్కించిన సినిమాలు అంతగా ఆకట్టుకోలేకపోతున్నాయి. పూరి దర్శకత్వంలో వచ్చిన ఇస్మార్ శంకర్ 2 సినిమా సైతం అంతగా మెప్పించలేదు.

ప్రస్తుతం పూరి జగన్నాథ్ కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతితో ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో సంయుక్త మీనన్, టబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. కొన్నాళ్లుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది.మరోవైపు పూరి తనయుడు ఆకాష్ పూరి హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా సినిమాలు చేసిన ఆకాష్.. ఇప్పుడు హీరోగా అలరిస్తున్నారు. ఇక పూరి తనయ సైతం ఒకప్పుడు సినిమాల్లో నటించిన సంగతి తెలిసిందే. పూరి కూతురి పేరు పవిత్ర. చైల్డ్ ఆర్టిస్టుగా కనిపించింది. ప్రభాస్ నటించిన బుజ్జిగాడు సినిమాలో పూరి కూతురు పవిత్ర నటించింది. ఆ తర్వాత మళ్లీ సినిమాలలో కనిపించలేదు. ఓవైపు ఆకాష్ హీరోగా వరుస సినిమాలు చేస్తుంటే.. మరోవైపు పవిత్ర మాత్రం చదువులపై దృష్టి పెట్టింది. అలాగే సోషల్ మీడియాలో ఎప్పుడో ఒక పోస్ట్ చేస్తుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోస్ వైరలవుతున్నాయి.

# సోషల్ మీడియా వేధింపులు

టాలీవుడ్ నటి, స్టార్ యాంకర్ అనసూయ భరద్వాజ్‌పై సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమెపై అసభ్యకరమైన పోస్టులు పెడుతూ వేధింపులకు పాల్పడిన ఒక వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం (మార్చి 13) అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కడప జిల్లా పులివెందుల పరిధిలోని జూటూర్ గ్రామానికి చెందిన జనార్ధన్ నగరానికి వచ్చి గచ్చిబౌలి ఇంద్రానగర్‌లో ఉంటున్నాడు. అనసూయను టార్గెట్ చేసుకుని ఏఐ ద్వారా రూపొందించిన నకిలీ వీడియో, అసభ్యకర వ్యాఖ్యలతో కూడిన పోస్టులను ఇన్‌స్టాగ్రామ్‌తోపాటు వివిధ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నాడు. తన సోషల్ మీడియా ఖాతాలకు ఎక్కువ వ్యూస్, ఫాలోవర్లు రావాలనే ఉద్దేశంతో జనార్ధన్ ఈ చర్యలకు పాల్పడినట్లు సమాచారం. అనసూయకు సంబంధించిన ఫోటోలు.. వీడియోలను జనార్ధన్ మార్ఫింగ్ చేసి, వాటిని అసభ్యకరంగా ఎడిట్ చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా ఆమె గురించి అనుచిత వ్యాఖ్యలు కూడా పెట్టి, ఆమె వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీనిపై నటి అనసూయ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అతడిని కడపలో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో జనార్ధన్ తన నేరాలను ఒప్పుకున్నట్లు సమాచారం. కేవలం సోషల్ మీడియాలో వ్యూస్, ఫాలోయింగ్, పేరు సంపాదించుకోవాలనే ఉద్దేశంతో సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకున్నట్లు జనార్ధన్ చెప్పినట్లు తెలుస్తోంది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జనార్ధన్ ను మరింత విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో ఎవరికైనా నష్టం కలిగించేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మరో కేసులో ఓ సినీనటి పోస్టు చేసిన యూట్యూబ్ రీల్స్‌ను చూసి అభ్యంతరకర వ్యాఖ్యలను పోస్టు చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ మారేడ్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ అరుణ్ కుమార్.. ఓ సినీనటి పోస్టుచేసిన రీల్స్‌ను తిలకించాక ఆమె ప్రతిష్ఠకు భంగం కలిగేలా అసభ్యకర వ్యాఖ్యలు పోస్టు చేశాడు. దీంతో ఆమె ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు అరుణ్ కుమార్‌ను అరెస్ట్ చేసి వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.



Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**